సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 12 । సెప్టెంబర్ । 2022

చెస్‌లో చిన్నారుల ప్రతిభ

రాజవొమ్మంగి: విశాఖపట్నంలో జరిగిన ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో రాజవొమ్మంగికి చెందిన చిన్నారులు సత్తా చాటారు. అండర్-7 విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలను వరుసగా తోట అవినాష్, దేశగిరి సాత్విక్ పొందారు. అండర్-9 విభాగంలో తోట హన్సిక ద్వితీయస్థానం పొందింది. వీరు స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ, కోచ్ రామ్‌కుమార్‌లు వీరిని అభినందించారు.



చెస్‌లో సత్తా చాటిన చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

I

అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

విధుల్లో అసువులు బాసిన అటవీశాఖ అధికారుల, సిబ్బంది త్యాగాలు చిరస్మరణీయమని ఆ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

IIలో



న్యూస్‌రీల్

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అడ్డతీగల: ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు రాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎ-1 కోఆర్డినేటర్ సీహెచ్.చిన్నిబాబు ఆదివారం తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి వచ్చేనెల 5 చివరి తేదీ అని చెప్పారు. వచ్చేనెల 7వ తేదీలోగా ప్రవేశ రుసుం చెల్లించవచ్చని తెలిపారు. రూ.200 లేటు ఫీజుతో అక్టోబర్ 26 వరకూ చెల్లించవచ్చని చెప్పారు. రూ.200 లేటు ఫీజుతో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి అక్టోబర్ 28 వరకూ గడవు ఉందని తెలిపారు. పదవ తరగతిలో చేరడానికి 14 సంవత్సరాలు నిండిన వారు, ఇంటర్మీడియెట్‌లో చేరడానికి పదవ తరగతి పాసై 15 సంవత్సరాల వయసు నిండిన వారు దరఖాస్తు చేయడానికి అర్హులని చెప్పారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎపిఒపిఇఎస్‌స్కూల్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోచ్చని తెలిపారు.

వర్షాలతో జలపాతాలు కనువిందు



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకులు

సాక్షి,పాడేరు/అనంతగిరి: జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో భారీగా నీరు ప్రవహిస్తూ జలపాతాలు కొత్త అందాలు సంతరించుకుని పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. జి.మాడుగుల మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కొత్తపల్లి జలపాతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. జలపాతం వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పర్యాటకులు నీటిలో దిగకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టారు. డముకు, తైడ జలపాతాల వద్ద ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సందర్శకులు సంబరపడుతున్నారు.

రైతుల గుండెల్లో వరద దడ

- క్రమంగా పెరుగుతున్న గోదావరి, శబరి నీటి మట్టాలు
- ఉధృతంగా వాగులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



నందిగామ వాగుకు పోటెత్తిన గోదావరి వరద



చింతూరు వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి నది

ఎటపాక/చింతూరు: గోదావరి, శబరి నదులకు వరద నీరు పోటెత్తుతుండడం రైతుల గుండెల్లో దడ పుట్టిస్తోంది. ఎడతెరిపిలేకుండా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు,వంకలు పొంగి పొర్లుతున్నాయి. గోదావరి, శబరి నదులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో విలీన మండలాల వాసులను మళ్లీ వరద ముంపు భయం వెంటాడుతోంది. గోదావరి వరద నీరు చేరుతుండడంతో ఎటపాక మండలంలోని మురుమూరు, నందిగామ,తోటవల్లి,నెల్లిపాక వాగులు ఆదివారం ఉదయం నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువన ఉన్న తాలిపేరు ప్రాజెక్టు,గోదావరి నదిపై ఉన్న ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో గోదావరి వరద మరింత పెరిగే అవకాశాలున్నట్టు సమాచారం. మరో రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో పరీవాహక ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం ఆదివారం సాయంత్రం 5గంటలకు 35.8 అడుగులకు చేరింది. జూలై,ఆగస్టు నెలల్లో వరదలతో అన్నదాతలు అతలాకుతలమయ్యారు. వరి,పత్తి పంటలు నీటమునగడంతో తీవ్రంగా నష్టపోయారు. మిర్చిపై ఆశలు పెట్టుకున్న రైతులు వేల రూపాయలు వెచ్చించి నెలరోజులుగా మడులను తయారు చేసుకుని పొలాల్లో నాటుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. కాగా గోదావరి వరద పెరుగుతుండడం వారికి కంటిమీద కునుకు లేకుండా పోతోంది. మండలంలో సుమారు 2వేల హెక్టార్లలో సాగు చేసే మిర్చి నారును సకాలంలో వేసుకోకపోతే దిగుబడులపై ప్రభావం చూపుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతూరు వద్ద శబరినది నీటి మట్టం ఆదివారం రాత్రి 29 అడుగులకు చేరుకుంది. నదీ పరీవాహక ప్రాంతంలోని పలు వాగులు పొంగి వరద నీరు రహదారుల పైకి చేరుతుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని చూటూరు, నర్సింగపేట నడుమ సోకిలేరువాగు, తిమ్మిరిగూడెం, ఏజీకొడేరు నడుమ జల్లివారిగూడెం వాగు పొంగి రహదారి పైనుంచి ప్రవహిస్తున్నాయి. దీని ప్రభావంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల నడుమ, చింతూరు మండలంలోని మల్లెతోట, ఉలుమూరు, ఏజీకొడేరు, తిమ్మిరిగూడెం, ముకునూరు, రామన్నపాలెం, బొడ్రాయిగూడెం, చినసీతనపల్లి, పెదశీతనపల్లి, కొండపల్లి, చదలవాడ, గవళ్లకోట, చొలూరు, మిట్టవాడ, ఏరువాడ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని కుయిగూరు, చీకటివాగు, చంద్రవంక వాగులు కూడా పొంగి ప్రవహిస్తున్నాయి. గతంలో రెండు పర్యాయాలు వరదలు వచ్చి గ్రామాలను ముంచెత్తడడంతో తీవ్రంగా నష్టపోయిన ముంపు గ్రామాల ప్రజలు ప్రస్తుతం మళ్లీ నీరు పెరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. గత వరదల నుంచి తేరుకుని నదీ పరివాహక ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే వరినాట్లు వేస్తున్న రైతన్నలను సైతం ప్రస్తుత వరద ఆందోళనకు గురిచేస్తోంది. చింతూరు మండలంలో గడచిన 24 గంటల్లో 90.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

రాజవొమ్మంగిలో 61.2 మిల్లీమీటర్లు

రాజవొమ్మంగి: మండలంలో ఆదివారం ఉదయం 61.2 మిల్లీమీటర్ల వర్షం పాతం నమోదు అయ్యింది. భారీ వర్షాలకు మండలంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. వట్టిగెడ్డ రిజర్వాయర్‌లోకి భారీగా నీరు చేరుతోంది. జడ్డంగి వద్ద మడేరు తదితర వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

కొండ్రాజుపేట చప్టాపైకి వరద నీరు

కూనవరం : ఎగువున కురుస్తున్న భారీ వర్షాలకు కూనవరం వద్ద గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం కొండ్రాజుపేట చప్టాపైకి వరద నీరు చేరడంతో కూనవరం టేకులబోరు నుంచి కొండ్రాజుపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కొండ్రాజుపేట, శబరి కొత్తగూడెం, కొత్తూరు, వీరంపురం, వెంకన్నగూడెం గ్రామాల ప్రజలు కూనవరం రావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూనవరం వద్ద సాయంత్రం 4గంటలకు గోదావరి నీటిమట్టం 29 అడుగులకు చేరుకుంది. సోమవారం మధ్యాహ్నానికి భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి 45 అడుగులకు చేరే అవకాశం ఉందని సమాచారం అందడంతో మండల ప్రజలు హడలెత్తిపోతున్నారు.



చింతూరు మండలం తిమ్మిరిగూడెం వద్ద రహదారి పైనుంచి ప్రవహిస్తున్న జల్లివారిగూడెం వాగు



వట్టిగెడ్డ రిజర్వాయర్



పొలాల్లో నాటుకునేందుకు సిద్ధంగా ఉన్న మిర్చి నారు

మోదమ్మ ఆలయానికి భారీగా భక్తులు



వెండి పాదాలు, పళ్లెంను అందజేస్తున్న వరుణ్‌కుమార్, కుటుంబ సభ్యులు

సాక్షి, పాడేరు: స్థానిక మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వర్షం కురుస్తున్నప్పటికీ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. పట్టణంలోని పలువురు భక్తులు ఘటాలను ఊరేగించి, ఆలయంలో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మైదాన ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి,అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయంలో ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేశారు.

వెండి పాదాలు, పళ్లెం బహూకరణ

విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన వల్లూరి వరుణ్‌కుమార్ అనే భక్తుడు 90 గ్రాముల వెండి పాదాలు, వెండి పళ్లెంను మోదమ్మకు సమర్పించి, మొక్కు తీర్చుకున్నారు. వాటిని ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, ఉప్పల వెంకటరత్నం, ఇతర ప్రతినిధులకు అందజేశారు.

జాబ్‌మేళా రేపు

మురళీనగర్(విశాఖ ఉత్తర): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంటు కార్యక్రమంలో భాగంగా కంచరపాలెం ఓల్డ్ ఐటీఐలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తామని ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య చెప్పారు. వెబ్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, యాక్ట్ ఫైబర్ నెట్, ఫ్లిక్ కార్ట్ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఎంబీయే చేసిన యువతీ యువకులు ఇందులో పాల్గొనవచ్చు. ఎంపికైనవారికి రూ.10,000లు నుంచి 30,000లు వరకు నెల జీతం చెల్లిస్తారు. ఎంపికైనవారు విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది. వివరాలకు 9885694676, 8523874274 నంబర్లలో సంప్రదించవచ్చు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మెరిసిన గిరి ఆణిముత్యాలు



పి.శ్యామ్‌ప్రసాద్ (628)



బాలరాజు (724)



హనుమంతు భారతి (1118)



సాగరిక మీనా (621)



నూతన సాయి ప్రియదర్శిని (655)



మల్లిక (697)



సవర శ్రావణి (935)



శీలత (1290)

మధురవాడ(భీమిలి): పరీక్ష ఏదైనా.. ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిస్తున్నారు మారికవలసలోని గిరిజన గురుకులాల విద్యార్థులు. జేఈఈ అడ్వాన్స్‌డ్-2022 పరీక్ష ఫలితాల్లో రెండు విద్యా సంస్థలకు చెందిన 8 మంది విద్యార్థులు సత్తా చాటారు. ముగ్గురికి సీట్లు రాగా.. ఐదుగురు ప్రిపరేటరీ సీట్లకు అర్హత సాధించారు. వీరిని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ, ప్రిన్సిపాళ్లు ఎల్.శివప్రసాద్, డి.లక్ష్మణరావు అభినందించారు.

- తిమ్మాపురం రోడ్డులోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎస్టీ కేటగిరీలో ర్యాంకులు సాధించారు. ఇక్కడ నుంచి 20 మంది పరీక్షకు హాజరు కాగా.. కొయ్యూరు మండలానికి చెందిన బి.శ్యామ్ ప్రసాద్ 628, హుకుంపేట మండలానికి చెందిన కొర్రా బాలరాజు 724వ ర్యాంకులు సాధించారు.
- మారికవలస గిరిజన గురుకుల బాలికల ప్రతిభా పాఠశాలకు చెందిన 24 మంది పరీక్షకు హాజరు కాగా.. ఎస్టీ కేటగిరీలో ఆరుగురు ర్యాంకులు సాధించారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలానికి చెందిన హనుమంతు భారతి 1118వ ర్యాంకు సాధించింది. ప్రిపరేటరీ కేటగిరీలో అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలానికి చెందిన సాగరిక మీనా 621, అడ్డతీగల మండలం డి.భీమవరానికి చెందిన కె.నూతన సాయిప్రియదర్శిని 655, పాడేరు మండలం దేవాపురానికి చెందిన కె.మల్లిక 697, జి. మాగుడుల మండలం రోలంగి కుట్టికి చెందిన సవర శ్రావణి 935, మన్యం జిల్లాలోని పార్వతీపురం మండలం కొసరవానివలసకు చెందిన వి.శీలత 1290వ ర్యాంకులు సాధించారు.

రంగురాళ్ల తవ్వకాల నిరోధానికి ప్రత్యేక నిఘా

- చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్
- సిగినాపల్లి క్వారీ, పరిసర గ్రామాల్లో అటవీ, పోలీసు శాఖ అధికారుల తనిఖీలు
- తవ్వకాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు : అధికారుల హెచ్చరిక



సిగినాపల్లి క్వారీని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్, ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, ఇతర అధికారులు



గిరిజనులతో మాట్లాడుతున్న అటవీ, పోలీసుశాఖ అధికారులు

గూడెంకొత్తవీధి: రక్షిత అటవీ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాల నిరోధానికి డ్రోన్‌లు, అధునాతన సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్టు చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్, విశాఖ స్క్వాడ్ డీఎఫ్‌వో శ్యామ్‌సుందర్, సబ్ డీఎఫ్‌వో త్రిమూర్తులు రెడ్డి, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, జి.కె.వీధి సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అటవీ, పోలీసుశాఖ అధికారుల బృందం సిగినాపల్లి క్వారీ, సమీప దొడ్డికొండ, నల్లబెల్లి, సిగినాపల్లి గ్రామాల్లో ఆదివారం ఆకస్మికంగా పర్యటించింది. ముందుగా సిగినాపల్లి క్వారీ కొండపైకి వెళ్లి రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని వారు పరిశీలించింది. ఈ క్వారీలో పెద్ద సొరంగాలు ఉండడంతో వాటిని మూసివేసేందుకు చర్యలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ కార్వీ ఎత్తైన కొండ ప్రాంతంపై ఉండడం, పూర్తిస్థాయి సిబ్బంది లేనందున అధునాతన సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. క్వారీ చుట్టూ ఉన్న గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం చుట్టుపక్కల గ్రామాల గిరిజనులతో సమావేశమయ్యారు.

వ్యాపారుల మాయమాటలు నమ్మి, డబ్బులకు ఆశ పడి రంగురాళ్ల తవ్వకాలకు వెళ్లవద్దని సూచించారు. తవ్వకాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తవ్వకాలకు ప్రోత్సహించే వ్యాపారుల వివరాలను తమకు అందిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఐదేళ్ల క్రితం ఇదే క్వారీ సొరంగంలో మట్టి పెళ్లలు పడి నలుగురు మృతి చెందారని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రత, నిఘా ఏర్పాటు చేస్తామని అటవీ, పోలీసు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.కె.వీధి ఎస్ఐ అప్పలసూరి, అటవీశాఖ సిబ్బంది వెంకటరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బోర్డు ప్రయాణాలకు ఫుల్‌స్టాప్

- ఆర్టీసీ బస్సులకు న్యూమాటిక్ డోర్లు
- ప్రమాదాల నివారణ కోసం ప్రయత్నం



న్యూమాటిక్ డోర్ ఇలా ఉంటుంది

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీ బస్సుల్లో ఫుట్ బోర్డు ప్రయాణానికి ఫుల్‌స్టాప్ పడనుంది. అన్ని బస్సుల్లో న్యూమాటిక్ డోర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రాణాంతకమని తెలిసినా కిక్కిరిసిన ఆర్టీసీ బస్సుల్లో డోర్ల వద్ద వేలాడుతూ చాలా మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో అధికంగా విద్యార్థులే ఉంటున్నారు. ఇలా ప్రమాదాలు పాలై కొందరు మృత్యువాత పడుతున్నారు. మరికొందరు క్షతగాత్రులవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు బస్సు పూర్తిగా ఆగకుండా దిగుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) ముమ్ముందు బస్సుల్లో న్యూమాటిక్ డోర్లను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్ సర్వీసుల్లో ఈ డోర్లే ఉన్నాయి. ఇకపై సాధారణ, సిటీ సర్వీసుల్లోనూ వీటిని అమర్చనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే సిటీ, పల్లె వెలుగు బస్సుల్లో వేలాడుతూ ప్రయాణించేందుకు వీలుండదు.

డ్రైవర్ల నియంత్రణలోనే.. : న్యూమాటిక్ డోర్ల నియంత్రణ డ్రైవర్ చేతిలో ఉంటుంది. డ్రైవర్ తన సీటు వద్ద ఉన్న బటన్ నొక్కితే ఎయిర్ ఆపరేటెడ్ విధానంలో ఈ న్యూమాటిక్ డోర్ తెరచుకుంటుంది.. మూసుకుంటుంది. ఇందుకు 3-5 సెకన్ల సమయం మాత్రమే పడుతుంది. ఆర్టీసీ యాజమాన్యానికి ఈ న్యూమాటిక్ డోర్ల ఏర్పాటు ఆర్థికంగా భారమైనప్పటికీ ప్రయాణికులభద్రతకు ప్రాధాన్యమిస్తూ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. చాలా సిటీ బస్సులు డోర్లు లేకుండానే నడుస్తున్నాయి. ఇకపై కొత్తగా వచ్చే బస్సులకు విధిగా న్యూమాటిక్‌డోర్లు అమరుస్తారని, ప్రస్తుతంఅనువుగాఉన్న బస్సులకు దశలవారీగా వీటి ని ఏర్పాటు చేస్తారని ఆర్టీసీవర్గాలుచెబుతున్నాయి. తొలుతసిటీబస్సులకుప్రాధాన్యమిస్తారని, ఆపై పల్లె వెలుగు సర్వీసులకు అమర్చేఅవకాశం ఉందని అంటున్నారు.

ఉమ్మడి రీజియన్‌లో 930 బస్సులు : ఆర్టీసీ ఉమ్మడి విశాఖ రీజియన్‌లో 930 బస్సులు ఉన్నాయి. వీటిలో 550 సిటీ బస్సులు విశాఖ నగర పరిధిలోని వివిధ డిపోల్లోను, మరో 30 బస్సులు అనకాపల్లి డిపోలోనూ నడుస్తున్నాయి. ఆర్టీసీ బస్సులకు న్యూమాటిక్ డోర్లు అమర్చడం వల్ల ఫుట్ బోర్డుపై ప్రయాణాలను నిలువరించి ప్రమాదాల బారిన పడకుండా చూడవచ్చని విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'తో చెప్పారు.

ఆనంద హే(సే)తువు

- మత్స్యగెడ్డపై వంతెన నిర్మాణంతో ప్రయాణం సుగమం
- ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రజలకు మేలు
- నాటు పడవ ప్రయాణం నుంచి విముక్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న సరిహద్దు గ్రామాల ప్రజలు

ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలకు ఆ సేతువు ఆనంద హేతువుగా మారింది. పెదబయలు మండల కేంద్రానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న మత్స్యగెడ్డపై ఇన్నాళ్లూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నాటుపడవలో సాహసించి ప్రయాణించేవారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక తప్పనిసరి పరిస్థితుల్లో రాకపోకలు సాగించేవారు. పలువురు మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. గెడ్డపై వంతెన కోసం ఏళ్ల తరబడి నిరీక్షించారు. ఎట్టకేలకు వారి కల ఫలించింది.



పెదబయలు వద్ద మత్స్యగెడ్డపై నిర్మించిన వంతెన



మత్స్యగెడ్డలో నాటు పడవపై ప్రయాణం(ఫైల్)

పెదబయలు: మండలానికి సమీపంలో ఒడిశా రాష్ట్రం సరిహద్దు ఉంది. ఇరు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న మత్స్యగెడ్డపై వంతెన నిర్మాణానికి ఒడిశా ప్రభుత్వం 2016-2017లో రూ.13 కోట్ల కేంద్ర నిధులతో పనులు చేపట్టింది. అంచనా వ్యయం పెరగడంతో రూ.22 కోట్లతో నిర్మాణం పూర్తి చేశారు. ఏడాదికి ఆరు నెలల పాటు మాత్రమే పనులు జరిగాయి. జోలాపుట్టు రిజర్వాయర్ బ్యాక్ వాటర్ వల్ల మిగిలిన ఆరు నెలలు పనులకు ఆటంకం కలిగేది. దీంతో రెండేళ్లలో పూర్తి కావలసిన వంతెన నిర్మాణానికి ఐదేళ్లు పట్టింది. వంతెన నిర్మాణం పూర్తవడంతో ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లోని నాలుగు పంచాయతీలు, ఒడిశా రాష్ట్రంలో 14 పంచాతీయల వాసులకు నాటు పడవ ప్రయాణం నుంచి విముక్తి లభించింది.

మెరుగుపడిన రవాణా : ఈ వంతెన నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడింది. సరిహద్దు గ్రామాల ప్రజలు తాము పండించిన పంటలను వారపు సంతలు, ఇతర ప్రదేశాలకు తరలించి విక్రయించుకునేందుకు అనువుగా ఉంది. పెదబయలు వారపు సంతలో పసుపు, పిప్పళ్లు ఇతర కూరగాయల, పంటలు, కిరాణా,నిత్యావసర సరకులు వ్యాపారం జోరందుకుంది.

ప్రకృతి అందాలకు మరింత చేరువ : పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో కనువిందు చేసే జలపాతాలు, జోలాపుట్టు రిజర్వాయర్, డుడుమ డ్యాం, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాలను సందర్శించడానికి ఈ మార్గంలో తక్కువ సమయంలో చేరుకోవచ్చు. ఇక్కడికి ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా కేంద్రం 80 కిలో మీటర్లు, జైపూర్ 90 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లేందుకు కూడా అరకు మీదుగా దగ్గరవుతుంది. పెదబయలు నుంచి రూడకోట, జామిగుడ మీదుగా వెళ్లే మార్గంలో జాన్‌బాయి వద్ద ఒడిశా రాష్ట్రం గురుప్రియ వంతెన నిర్మించింది. ఈ వంతెనను కలుపుతూ జాన్‌బాయి నుంచి జామిగుడ వరకు చేపట్టిన రోడ్డు పనులు పూర్తయ్యాయి.

మన రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో.. : రూడకోట నుంచి జామిగుడ వరకు రోడ్డు నిర్మాణ పనులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్ల వ్యయంతో ప్రారంభించింది. పెదబయలు నుంచి కుజభంగి మీదుగా, జామిగుడ నుంచి జాన్‌బాయ్ బ్రిడ్జి మీదుగా సీలేరు వరకు ఇదే ప్రధాన రహదారి. మత్స్యగెడ్డపై వంతెన నిర్మాణంతో పెదబయలు నుంచి సుమారు రెండు గంటల వ్యవధిలోనే సీలేరు చేరుకోవచ్చు. ఆరు నెలల కిందట ఈ వంతెనను ప్రారంభించారు. వంతెన అందుబాటులో రావడంతో ఏళ్లనాటి తమ కల సాకారమైందని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్తుల చెంతకు చేరిన జింక

గ్రామస్తుల్లో ఆనందం

సాక్షి ఎఫెక్ట్..

రాజవొమ్మంగి: మారేడుమిల్లి అడవుల్లో వదిలిపెట్టిన చుక్కల జింకను అటవీశాఖ అధికారులు తిరిగి స్వగ్రామం లక్కవరప్పాడు తీసుకొచ్చి దానిని చేరదీసిన గిరిజనులకు అప్పగించారు. ×ఘాట్ రోడ్డుపై చుక్కల జింక। శీర్షికన ఆదివారం ×సాక్షి÷లో ప్రచురితమైన వార్తకు ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. పూర్తి వివరాల్లోకి వెళితే లక్కవరప్పాడు గ్రామానికి చెందిన రైతు గూనా అప్పారావు కుటుంబీకులు ఓ చుక్కల జింకను మూడేళ్లుగా పెంచుకొంటున్నారు. నెలల వయస్సు గల మగ జింక పిల్ల పొలంలోకి దారి తప్పి వచ్చిందని, అప్పటి నుంచి దానిని చేరదీసి, చిట్టి అని పేరుపెట్టి సొంత బిడ్డలా సాకుతున్నామని అప్పారావు, అతని తల్లి రాజులమ్మ చెప్పారు. కాగా ఆ విధంగా పెంచడం అటవీ చట్టం ప్రకారం నేరం అని అటవీ అధికారులు జింకను స్వాధీనం చేసుకొని మారేడుమిల్లి అడవుల్లో వదిలిపెట్టారు. అయితే ఆ జింక అడవిని వీడి రోడ్లపైకి వచ్చేసింది. దీనిపై ×సాక్షి÷లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాకినాడ జిల్లా అటవీ అధికారి ఐ.కె.వి.రాజు ఆదేశాల మేరకు జింకను చేరదీసిన కుటుంబానికి అప్పగించినట్టు స్థానిక అటవీ క్షేత్రాధికారి అబ్బాయిదొర విలేకరులకు తెలిపారు. ఎట్టకేలకు చుక్కల జింక స్వగ్రామం చేరుకోవడంతో ఆ కుటుంబీకులు, గ్రామస్తుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆ జింకకు బిస్కట్లు తినిపించి అక్కున చేర్చుకొన్నారు. మారేడుమిల్లి నుంచి జింకను తీసుకొని వచ్చిన వారిలో ఎఫ్‌బీఓ. సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.


జింకకు బిస్కట్లు తినిపిస్తున్న రాజులమ్మ తదితర కుటుంబ సభ్యులు

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- అనుకూలించిన వాతావరణం
- చేతికందిన పంట సేకరణలో రైతులు నిమగ్నం
- మార్కెట్‌లో గిరాకీ


బీన్స్ సేకరిస్తున్న గిరిజన రైతులు


పంట నుంచి సేకరించిన కీరదోసను తీసుకొస్తున్న రైతులు

డుంబ్రిగుడ: మన్యంలోని ప్రస్తుతం కూరగాయలు, ఆకుకూరల సాగు జోరందుకుంది. ఇందుకు ప్రధాన కారణం వాతావరణం అనుకూలించడం. గడిచిన మూడు నెలలుగా ఏజెన్సీలో కురిసిన వర్షాలకు సాగునీటి ఇబ్బందులు లేకపోవడంతో కూరగాయలు, ఆకుకూరలు, సామలు, చోడి, కొర్రలు తదితర పంటలను విస్తారంగా పండించారు. ఎటువంటి రసాయనాలు లేకుండా ఏజెన్సీలో పండించే పంటలకు మైదాన ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కూరగాయలు, ఆకుకూరల పంటల దిగుబడి ప్రారంభమైంది.

సంతల్లో జోరుగా వ్యాపారం

మండలంలోని సొవ్వ పంచాయతీ దేముడువలస, మాలివలస, పనసవలస తదితర గ్రామాల్లో కూరగాయల పంటలను గతేడాది కంటే ఎక్కువ విస్తీర్ణంలో పండించారు. మండంలోని కూరగాయల పంటలకు సొవ్వ పంచాయతీకి మంచి పేరుంది. ఆయా గ్రామాల్లో బీన్స్, కీరదోస, వంగ, చిక్కుళ్లు, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ టమాటా తదితర పంటలను సుమారు 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పండిస్తున్నారు. ఆయా ప్రాంత రైతులు పండించిన వాటిని స్థానిక సంతలతో పాటు అరకు, పాడేరు సంతల్లో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం కీరదోస, బీన్స్, క్యాబేజీ పంటల దిగుబడి బాగుంది. స్థానిక సంతల్లో 50 కిలోల బీన్స్ రూ.800 నుంచి రూ.1050 వరకు, 50 కిలోల క్యాబేజీ రూ.800 నుంచి రూ.1100 వరకు, క్యాలీఫ్లవర్ రూ.900 నుంచి రూ.1100 వరకు ధర పలుకుతోంది. గతేడాది కంటే ఈ ఏడాది మంచి ధరలు ఉన్నాయని గిరిజన రైతులు చెబుతున్నారు. మైదాన ప్రాంత వ్యాపారులు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తున్నారంటున్నారు. మరికొద్ది రోజుల్లో వంగ, చిక్కుళ్లు తదితర పంటల దిగుబడి ప్రారంభమవుతుందని చెబుతున్నారు. ఇక్కడ పండించే కీరదోసకు చాలా ప్రత్యేకత ఉందని, పెద్దసైజులో ఉంటుందని, మైదాన ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉందంటున్నారు. ప్రస్తుతం కీరదోస కిలో రూ.40 నుంచి రూ.45 వరకు ధర ఉంది. ఇక్కడ పండించే కూరగాయలను స్థానిక సంతలతో పాటు విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో రైతు బజార్లకు తరలిస్తున్నామని చెబుతున్నారు. రానున్న రోజుల్లో కూరగాయలకు మంచి ధరలతో లాభాలు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కడుపు నొప్పితో మహిళ మృతి


కొజ్జిరిగుడ గ్రామాన్ని సందర్శించిన వైద్యాధికారి, సిబ్బంది


పాంగి దసాయి(ఫైల్)

పెదబయలు: మండలంలో మారుమూల జామిగుడ పంచాయతీ కొజ్జిరిగుడ గ్రామానికి చెందిన పాంగి దసాయి(38) అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందినట్టు రూడకోట వైద్యాధికారి సీహెచ్ అశోక్ సాగర్ తెలిపారు. నాలుగు రోజుల నుంచి కడుపు నొప్పితో బాధపడుతోందని, ఆదివారం సమాచారం అందడంతో హుటాహుటిన గ్రామానికి వెళ్లినట్టు ఆయన చెప్పారు. అప్పటికే ఆమె మృతిచెందినట్టు తెలిపారు. చాలా కాలం నుంచి అప్పుడప్పుడు ఆమెకు కడుపు నొప్పి వస్తోందని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. మృతురాలికి భర్త సన్యాసి, ఐదుగురు పిల్లలు ఉన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని, లేకుంటే సమాచారం అందించాలని వైద్యాధికారి కోరారు. తల్లి మరణంతో పిల్లలు, కుటుంబ సభ్యుల రోదన అందర్నీ కలిచివేసింది.

అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం


రేఖపల్లి ఎఫ్‌ఆర్‌ఓ కార్యాలయంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది


చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

వీఆర్ పురం: తమ ప్రాణాలను సైతం లెక్కపెట్టక ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ, విధుల్లో అసువులు బాసిన అటవీశాఖ అధికారుల, సిబ్బంది త్యాగాలు చిరస్మరణీయమని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.అబ్బులు, రైటర్ యు.కరుణాకర్ అన్నారు. అటవీశాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం రేఖపల్లిలోని రేంజ్ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా సిబ్బంది అమరవీరులకు నివాళులర్పించి, ,ప్రమాణం చేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరప్పన్ వంటి స్మగ్లర్ల దాడుల్లో ఎంతో మంది అటవీశాఖ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అనంతరం ప్రధాన రహదారిపై ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ నాయకులు టి.సాయి, బి.శేఖర్, కూనవరం రేంజ్ ఆఫీసర్ మోహిని విజయలక్ష్మి, డీఆర్‌ఓ టి.సూర్యచంద్రం, ఎఫ్ఎస్ఓలు నాగమణి, బుచ్చిరాజు, ఎఫ్‌బీఓలు సంఘం రమేష్ ,హరీష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని స్థానిక అటవీ అధికారులు ఆదివారం నిర్వహించారు. స్థానిక అటవీ క్షేత్ర కార్యాలయంలో అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరులకు జోహార్లర్పించారు. అటవీక్షేత్రాధికారి అబ్బాయిదొర, ఎఫ్ఎస్ఓ డీఎస్ఎన్. మూర్తి, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు, బేస్‌క్యాంప్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి రూరల్ : మండల కేంద్రంలో ఆదివారం అటవీశాఖ అధికారులు అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. రేంజ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యాలయం నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయంలో అమరవీరులకు నివాళులర్పించి వారి సేవలను గుర్తు చేసుకున్నారు. పలువురు అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయుడు నాగేశ్వరరావును సన్మానిస్తున్న బాల వికాష్ ఫౌండేషన్ ప్రతినిధులు

పెదబయలు: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1 ప్రధానోపాధ్యాయుడు తామర నాగేశ్వరరావును ఆదివారం విశాఖకు చెందిన బాల వికాష్ ఫౌండేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన గురుపూజోత్సవంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నాగేశ్వరరావు అవార్డును అందుకున్న విషయం విదితమే. అవార్డు గ్రహీతను బాల వికాష్ ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అఖిల భారత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


తీవ్ర గాయాలతో పడి ఉన్న సాగరి ఈశ్వర్

అరకులోయ రూరల్ : మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన పాంగి ఉదయ్, బలరాం, సాగరి ఈశ్వర్‌లు బైక్‌పై ప్రయాణిస్తూ ముందు వెళ్తున్న బస్సును ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో ఈశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఉదయ్, బలరాంలు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రు లను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందించారు. అక్కడి నుంచి ఈశ్వర్‌ను మెరుగైన వైద్య సేవలకోసం విశాఖ కేజీహెచ్‌కు పంపారు.

దాలియా అందాలు అదుర్స్


కొల్లాపుట్టులో నీలిరంగు దాలియా పూలు


డెక్కపారు గ్రామంలో ఎరుపు రంగులో దర్శనమిస్తున్న దాలియా

డుంబ్రిగుడ: మన్యంలో ప్రస్తుత సీజన్‌లో ప్రకృతి అందాలు కట్టిపడేస్తున్నాయి. ఎత్తైన కొండలను తాకుతున్న మేఘాలు...హోరెత్తుతున్న జలపాతాలు.. పచ్చనిబయళ్లు కనువిందు చేస్తున్నాయి. దీంతో పాటు మన్యంలో ఈ సీజన్‌లో ప్రత్యేకంగా పూసే పలురకాల పువ్వులు ఆకట్టుకుంటున్నాయి. ఇందులో రంగుల రంగుల దాలియా పూలు పలు ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. మండలంలోని ఆంధ్రా–ఒడిశా ప్రాంతం సరిహద్దు ప్రాంతంలో ఉన్న కొల్లాపుట్టు పంచాయతీ మారుమూల ప్రాంతమైన ఎగువ కొల్లాపుట్టు, డెక్కపారు గ్రామాల్లో గిరిజనుల పెరట్లో పూసిన దాలియా పుష్పాలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. నీలి, ఎరుపు రంగుల్లో పూసిన దాలియా పూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.


డుంబ్రిగుడలో పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు


రాజవొమ్మంగిలో పొంగి ప్రవహిస్తున్న వట్టిగెడ్డ వాగు వద్ద దాటేందుకు వేచి ఉన్న గ్రామస్తులు


జీకే వీధి మండలం పులిగుప్ప గ్రామానికి వెళ్లేందుకు ప్రమాదకర గెడ్డ దాటుతున్న ఆటో

మన్యంలో విస్తారంగా వర్షాలు

డుంబ్రిగుడ/గూడెం కొత్తవీధి/సీలేరు/రాజవొమ్మంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన మన్యంలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని రహదారులు జలమయమయ్యాయి. భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. టమాట, క్యారెట్, బీన్స్, తదితర కూరగాయలు పాడైపోయాయని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారపు సంతలకు ఆటంకం కలిగింది.

టీడీపీ నుంచి 130 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

సాదరంగా ఆహ్వానించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రజలకు ఏమి కావాలో.. అవి అమలు చేయడమే ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలో జి. జగన్నాథపురం గ్రామానికి చెందిన 130 మంది తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేశారు. గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సమక్షంలో వీరంతా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అవుగడ్డ పాత్రుడునాయుడు, ముత్యాలనాయుడు, రామ అప్పారావు, సతీష్, కొట్టాన అప్పారావు, బాదిరెడ్డి శంకరరావు, అల్లు రమేష్, కాకి అప్పలరాజు, భీశెట్టి బుచ్చింనాయుడు, పేలూరి అబద్ధం, జయవరపు అప్పలరాజు, కొట్టాన కొండబాబు, మహాలక్ష్మీనాయుడుల ఆధ్వర్యంలో 130 మంది కార్యకర్తలు టీడీపీ నుంచి చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. ఎన్నికల హామీలతోపాటు ఏ వర్గ ప్రజలకు ఏ సమయంలో ఏమి అవసరమో తెలుసుకుని, వారిని ఆదుకునే విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ప్రశంసించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా పథకాలు ఇవ్వడమే కాకుండా వాటిని నేరుగా లబ్ధిదారుని ఇంటికే చేరేలా సచివాలయం, వలంటరీ వ్యవస్థ తెచ్చి పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నుంచి చేరిన పాత్రుడునాయుడు, ముత్యాలనాయుడు, తదితరులు మాట్లాడుతూ అందర్నీ ఒకేలా చూస్తూ ఇంటికే ప్రభుత్వ పథకాలందించే జగన్‌మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని గతంలో చూడలేదని ప్రశంసించారు. ఇప్పటి వరకు టీడీపీలో ఉన్నప్పటికీ తమకు అనేక పథకాలు అందాయన్నారు. ముఖ్యమంత్రి పాలన నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయశ్రీకాంత్, ఎంపీపీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని సైక్లిస్టు మృతి


దేవుళ్లు మృతదేహం

పాయకరావుపేట: లారీ ఢీ కొట్టడంతో పట్టణంలోని శెట్టిబలిజపేటకు చెందిన పెంకే దేవుళ్లు (45) శనివారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ శిరీషా వివరాల ప్రకారం... పాయకరావుపేట నుంచి సైకిల్‌పై తుని వెళ్తుండగా, తాండవ జంక్షన్ వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధికి మరో చేయూత

- గడప గడపకు మన ప్రభుత్వం
- కార్యక్రమం ద్వారా సమస్యల గుర్తింపు
- గ్రామ స్థాయి సమస్యల పరిష్కారానికి నిధులు
- ముఖ్యమంత్రి నిర్ణయంపై హర్షాతిరేకాలు


మాకవరంలో గ్రామ సచివాలయం

ముంచంగిపుట్టు: సచివాలయాల ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ప్రభుత్వం ఇప్పుడు మరో అడుగు ముందుకేసింది. స్థానికంగా ఉన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు, నియోజకవర్గానికి మరో రెండు కోట్ల రూపాయలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు పర్యటించినపుడు ఆయా గ్రామాల పరిధిలో నెలకొన్న సమస్యలను గుర్తించి ఆయా నిధులతో పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇందులో భాగంగా తాగునీరు, పారిశుధ్యం, కాలువల నిర్మాణం, మరమ్మతులు, సీసీ రోడ్లు, శ్మశానవాటికల పనులు, పాఠశాలలు, ఆస్పత్రుల ప్రహారీ నిర్మాణాలకు ఈ నిధులను వినియోగించుకునే వీలుంది. దీంతో గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతంగా కానుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై గ్రామాల్లో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

చిన్న పంచాయతీలకు వరం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో చిన్న పంచాయతీలకు ఈ నిధులు వరంగా మారాయి. ఆదాయం తక్కువగా ఉండే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు నిధుల కొరత ఎక్కువగా ఉంటుంది. వచ్చిన ఆదాయం పంచాయతీ నిర్వహణకే సరిపోతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కేటాయించనున్న ఆయా నిధులు పంచాయతీల్లో అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయి. పనుల ఆమోదం, నిధుల విడుదల కలెక్టర్ ఆధ్వర్యంలో జరగనుంది.

అరకు నియోజకవర్గంలో సచివాలయాలు

ముంచంగిపుట్టు-18, పెదబయలు-16, హుకుంపేట-26, డుంబ్రిగూడ-16, అరకు-16, అనంతగిరి-22 సచివాలయాల చొప్పున మొత్తం 113 సచివాలయాలున్నాయి.

అభివృద్ధి పథంలో గ్రామాలు



గ్రామ సచివాలయం ద్వారా ఎనలేని సేవలను ప్రజలకు అందిస్తున్నారు. ప్రతి సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించడం అభినందనీయం. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆయా నిధులతో అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలో నడిపిస్తాయి.ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ప్రతి నిర్ణయం చరిత్రాత్మకం, హర్షణీయం.

– చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యే, అరకు నియోజకవర్గం

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు



ప్రభుత్వం విడుదల చేయనున్న నిధులతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలు వెంటనే పరిష్కరించే వీలుంటుంది. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించవచ్చు. చిన్న పంచాయతీల్లో సైతం విస్తృతంగా అభివృద్ధి పనులు జరుగుతాయి. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులు వేగవంతం చేయవచ్చు.

– డి.సీహెచ్.ప్రభాకరం, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

గిరిజనుల అభ్యున్నతికి పెద్దపీట


గ్రామస్తులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఏజెన్సీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని లోతేరు పంచాయతీలో పెదవలస, సిరోసుగుడ, డుంబ్రిగుడ, గానుకవలస గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్గుణ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులకు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 230 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ నవరత్న పథకాలపై రూపొందించిన బ్రోచర్‌ను గ్రామస్తులకు అందజేశారు. సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ మన్యం అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. పెదవలస గ్రామంలో రహదారి నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే పాల్గుణ చెప్పారు. ఎంపీపీ ఉషారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, సర్పంచ్ కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు రాములమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాసి, నాయకులు రఘునాథ్, లక్ష్మణ్, శెట్టి అప్పాలు, వెంకటరావు, శ్రీరాం, నొబ్బో, జగన్నాథం, భీమన్న, తిరుపతి, రామ్మూర్తి, అప్పలరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిల్లలకు ఆధార్ నమోదు


పిల్లలకు ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

సీలేరు: ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ సేవలు అందించేందుకు స్థానిక సచివాలయంలో శిశు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. చింతపల్లి నుంచి సిబ్బందిని అందుబాటులో తీసుకువచ్చి వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో పిల్లలకు ఆధార్ కార్డు నమోదు చేయించారు. సీలేరు, పార్వతీనగర్, ఎస్.నేరెడుపల్లి, దుప్పులవాడ, కాట్రగెడ్డ గ్రామాల నుంచి వచ్చిన 22 మంది పిల్లలకు ఉచితంగా ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్, మహిళా పోలీసు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ


మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి చెట్టి వినయ్

హుకుంపేట: అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు మండలంలోని గూడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి చెట్టి వినయ్ స్థానిక నాయకులతో కలిసి ఆదివారం పర్యటించారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఓలేసు రత్నకుమారి బంధువులైన ఓలేసు సుందరమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చెట్టి వినయ్, పార్టీ నాయకులు తదితరులు రత్నకుమారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు శ్యాముల్, కోటిబాబు, సాయిప్రసాద్, శేఖర్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరకులు


వరద బాధితులకు సరకులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వీఆర్ పురం: వీఆర్ పురంలోని సుమారు 150 మంది దివ్యాంగ వరద బాధిత కుటుంబాలకు బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరకులు అందజేశారు. నాయకులు రామారావు, వెంకటరమణ, రాజేంద్రప్రసాద్, రత్తయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


కోట్లగరువు మలుపు వద్ద ఒరిగిన ఆర్టీసీ బస్సు

పాడేరు రూరల్ : విశాఖపట్నం నుంచి పాడేరుకు ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని కోట్లగరువు మలుపు వద్ద బ్రేకు ఫెయిలవడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును రోడ్డు పక్కకు ఆపే ప్రయత్నం చేశారు. వర్షాల కారణంగా రోడ్డు పక్కన బురద ఉండడంతో బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్లను ఢీకొట్టి నిలిచిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ఉండకపోతే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని ప్రయాణికులు తెలిపారు.

నేడు గడుఓకుర్తిలో గడప గడపకు

రాజవొమ్మంగి: మండలంలోని గడుఓకుర్తి సచివాలయ పరిధిలోని దోనెలపాలెం గ్రామం నుంచి సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైద్య సిబ్బందిని నియమించాలి

కొయ్యూరు: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.జీవన్‌కృష్ణ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో వైద్య సిబ్బందిని నియమించాలని, విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో ధ్యానంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 108 పిరమిడ్స్ ధ్యాన-జ్ఞాన సప్తాహంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజానగరం నుంచి వచ్చిన నెక్కంటి అనిత పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె ధ్యానం వల్ల కలిగే ఉపయోగాలు, శ్వాసపై ధ్యాస తదితర అంశాలను వివరించారు. రోజూ ధ్యానం చేయడంతో ఒత్తిడిని జయించవచ్చన్నారు. ధ్యానంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మనసు ప్రశాంతంగా ఉంటుందని వివరించారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని సూచించారు. పిరమిడ్ విశిష్టతను తెలిపారు. రాజవొమ్మంగి పిరమిడ్ సొసైటీ మాస్టర్ నక్కా వీరబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బాలికల బీసీ వసతి గృహంలో విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ ఇచ్చారు.

ఏపీఎస్‌పీ మండల కమిటీ ఎన్నిక

ఎటపాక: ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏపీఏస్‌పీ) మండల కమిటీ ఎన్నిక ఆదివారం చినన ల్లకుంట ఆశ్రమ పాఠశాలలో జరిగింది. జిల్లా కన్వీనర్ కుంజా శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కమిటీ అధ్యక్షుడిగా ఇర్పా బాబు, ఉపాధ్యక్షుడిగా పూనెం జయంత్, ప్రధాన కార్యదర్శిగా సాంబ శివ ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా అనిల్‌కుమార్, గణేష్‌తో పాటు మరికొందరు ఎన్నికయ్యారు. మడివి నెహ్రూ, పూసం శ్రీను, నూపా అనిల్, కాక రాజు, ప్రసాద్, శ్రీను తదితరులున్నారు.

ఆడపిల్లల వివాహానికి ప్రభుత్వం చేయూత

పాడేరు రూరల్: పేదింటి కుటుంబ ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం చేయూతనిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చెప్పారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు చెందిన ఆడ పిల్లల వివాహానికి ఆర్థికసాయం చేసేందుకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చడం చరిత్రాత్మకమన్నారు. ఆయా పథకాలను ప్రకటించినందుకు కృతజ్ఞతగా సోమవారం అన్ని మండలాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకంతో పాటు మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమాలకు అన్ని మండలాల పార్టీకి చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న వారు, పార్టీ శ్రేణులు, ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాల సోదరులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

400 మందికి వైద్య పరీక్షలు


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రంపచోడవరం: సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వినిశ్చలానంద మాట్లాడుతూ శిబిరంలో సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఇందులో భాగంగా అవసరమైన వారికి రక్త పరీక్షలు, ఈసీజీ, థైరాయిడ్, ఫిజియోథెరపీ తదితర పరీక్షలు చేసినట్టు తెలిపారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 25 మందికి కళ్లద్దాలు అందజేసినట్టు చెప్పారు. 15 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం వేమగిరి తరలించామన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన రోగులకు భోజన సదుపాయం కల్పించామన్నారు. డాక్టర్లు గోలి వెంకట రామారావు, బిక్కిన రాఘువేంద్రరావు, కస్తూరి సుబ్రహ్మణ్యం, వై.రామచంద్ర రావు, పాతూరి కృష్ణ, రామకృష్ణ మిషన్ స్వామి వేద విద్యానందజీ, కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, రామకృష్ణ మిషన్ వలంటీర్లు బంద్రం, భగీరధ రాజు, ఉదయ్ కిరణ్, కోట్ల మంగిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం


అడ్డతీగల సోమాలమ్మ వీధిలో గణనాథుని నిమజ్జనంలో గ్రామస్తులు


గన్నేరుకొయ్యపాడులో గణనాథుడు ఊరేగింపు


గంగవరంలో వినాయకుని ఊరేగింపులో సందడి చేస్తున్న యువకులు

అడ్డతీగల: అడ్డతీగలలోని సోమాలమ్మవీధిలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన బాలవిఘ్నేశ్వరుని ఉత్సవ విగ్రహ నిమజ్జనం ఆదివారం ఘనంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్పులతో గ్రామంలో ఊరేగించిన అనంతరం మద్దిగడ్డ జలాశయంలో నిమజ్జనం చేశారు.మరికొన్ని వీధిల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను ఆయా ఉత్సవ కమిటీల సభ్యులు ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేశారు.

ఎటపాక: గన్నేరుకొయ్యపాడు, గౌరిదేవిపేట, తోటపల్లి, సీతాపురం తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన గణనాథుల ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు, వాయిద్యాల నడుమ భారీగా ఊరేగించారు. ఊరేగింపులో బాణ సంచా కాలుస్తూ యువత సందడి చేశారు. గోదావరిలో నిమజ్జనం చేశారు. అనంతరం మండపాల వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

గంగవరం : మండల కేంద్రంలోని రామాలయం ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గంగవరం వీధుల్లో గణనాథుని విగ్రహాన్ని ఊరేగించారు. యువకులు నృత్యాలు చేస్తు సందడి చేశారు. అనంతరం జడేరు కాలువలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

సర్వే ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం


అల్లూరి జిల్లా సర్వే ఉద్యోగుల కార్యవర్గ సభ్యులు

సాక్షి,పాడేరు : అల్లూరి జిల్లా సర్వే ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికను ఆదివారం పాడేరులో నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.రాజేశ్వరరావు, ఎన్నికల అధికారి ఆర్.చిరంజీవి ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.లక్ష్మణరావు, కార్యదర్శిగా పి.లీలా కృష్ణ, ఉపాధ్యక్షుడిగా టి.దేవరత్నం, సంయుక్త కార్యదర్శిగా ఎస్.కై లాసరావు, కోశాధికారిగా కె.సుదీర్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా టి.తులసిదాస్,జి.విజయ శంకర్, ఎస్.ఉమాపతి, ఎ.స్వామినాయుడు, వి.అప్పారావు, ఎస్.సురేష్‌కుమార్‌లు ఎన్నికయ్యారు.

శిథిలావస్థలో జీసీసీ కార్యాలయం


జీసీసీ కార్యాలయ భవనంలో పెచ్చులూడిన శ్లాబ్

కొయ్యూరు: సింగవరంలో గిరిజన సహకార సంస్థ భవనం శిథిలావస్థకు చేరింది. భవనం శ్లాబ్ పాడవడంతో వర్షాలు కురిసినపుడు నీరు కారుతోందని, రికార్డులు ఇతర సామగ్రి తడిసిపోతుందని సిబ్బందితో పాటు గ్రామస్తులు చెబుతున్నారు. గోడలు బీటలు వారాయని, శ్లాబ్ పెచ్చులూడుతున్నాయని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తామని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనం విషయాన్ని బీఎంలు పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనాన్ని మంజూరు చేయాలని సిబ్బందితో పాటు స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై జీసీసీ బీఎం విజయ కుమార్ మాట్లాడుతూ ఇది వరకు భవనం పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించినట్టు తెలిపారు.

ముల్లంగికి గిరాకీ


గొందివలస గ్రామంలో సేకరించిన ముల్లంగిని శుభ్రం చేస్తున్న రైతులు

డుంబ్రిగుడ: ఏజెన్సీలోని వారపు సంతల్లో ఆకుకూరలతో పాటు క్యాబేజీ, క్యాలీఫ్లవర్, ముల్లంగికి గిరాకీ నెలకొంది. మండలంలోని సొవ్వ, గసభ, కొల్లాపుట్టు, గొందివలస, అరమ తదితర ప్రాంతాల్లో టమాటా, వంగ, ముల్లంగి విస్తారంగా పండిస్తున్నారు. ఇక్కడ పండిస్తున్న ముల్లంగి, క్యాబేజీ తదితర కూరగాయలను మైదాన ప్రాంత వ్యాపారులు వచ్చి గిరిజన రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఏజెన్సీ వారపు సంతల్లో ముల్లంగి 20 కిలోలు రూ.200 నుంచి రూ.250 వరకు ధర పలుకుతుందని, పెరిగే అవకాశాలున్నాయని గిరిజన రైతులు చెబుతున్నారు.

చిత్తడి దారులతో ఇక్కట్లు


రోంపల్లి రహదారిలో వర్షాలకు కోతకు గురైన కల్వర్టు

అనంతగిరి: కొద్ది రోజులుగా మండలంలోని కురుస్తున్న భారీ వర్షాలతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు. మండలంలోని రోంపల్లి పంచాయతీ రొంపల్లి గుర్లకు వెళ్లే మార్గమధ్యలోని నూతిగెడ్డ సమీపంలోని కల్వర్టు కోతకు గురికావడంతో 14 గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడింది. గతంలో కురిసిన వర్షాలకు ఇదే రహదారిలోని కల్వర్టు కోతకు గురికావడంతో సర్పంచ్ చిరంజీవి తన సొంత నిధులతో మరమ్మతు పనులు చేయించారు. అధికారులు స్పందించి కోతకు గురైన కల్వర్టు వద్ద మరమ్మతు పనులు చేపట్టాలని గిరిజనులు కోరారు.

అరకులోయ రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో కొత్తభల్లుగూడ పంచాయతీ చాపరాయివలస, బూరుగులపుట్టు, సూకురుగూడ, కొర్రాగూడ గ్రామాల్లోని రహదారులు చిత్తడిగా మారాయని స్థానికులు చెబుతున్నారు. వాహనచోదకులు, పాదచారులు జారిపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతు చేయాలని వారు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


రక్షణ గోడ లేక ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు


ఎటపాకలో రహదారిపైకి ఒరిగి ఉన్న చింత చెట్టు


అనంతగిరి మండల కిలగాడ ఘాట్‌రోడ్డుపై అడ్డంగా ఉన్న చెట్టు సగ భాగం

మారేడుమిల్లి: మారేడుమిల్లి-చింతూరు వెళ్లే ప్రధాన రహదారిలో స్థానిక సోమిరెడ్డిపాలెం వద్ద ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఈ కల్వర్టుకు ఇరువైపులా ఎటువంటి రక్షణ గోడలు లేవు. వాహనదారులు ఈ మార్గంలో ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదాల బారిన పడాల్సిందే. గతంలో ఇక్కడ పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ కల్వర్టు మీదగా కాకినాడ, రాజమహేంద్రవరం, గోకవరం, రాజోలు, డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు తెలంగాణ రాష్ట్రం భద్రాచలంతో పాటు చత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాలకు బస్సులు, భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పర్యాటక ప్రదేశం కావడంతో నిత్యం పర్యాటకుల తాకిడి ఉంటుంది. దీంతో ఈ మార్గంలో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందని వాహనదారులు, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టులకు రక్షణగోడలు లేకపోవడంతో వాహనాలు ఏ మాత్రం ఆదుపు తప్పినా కొండవాగులో పడి పెను ప్రమాదం సంభవించే ఆస్కారం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

కిలగాడ్ ఘాట్ రోడ్డులో..

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ మార్గంలో కిలగాడ ఘాట్ మలుపు వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల ఈదురు గాలులకు భారీ మామిడి చెట్టు పడి రాకపోకలకు విఘాతం కలిగిన విషయం తెలిసిందే. అప్పటికప్పుడు చెట్టు సగ భాగం తొలగించి వదిలేయడంతో ప్రమాదభరితంగా మారింది. మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో భయం భయంగా వాహనదారులు కిలగాడ ఘాట్‌లో ప్రయాణిస్తున్నారు.ఈ మలుపు వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

కూలేందుకు సిద్ధంగా చెట్టు

ఎటపాక: భద్రాచలం నుంచి కూనవరం వెళ్లే రహదారిపై గన్నవరం వద్ద భారీ చింతచెట్టు నేల కూలేందుకు సిద్ధంగా ఉంది.ఇటీవల వర్షాలకు చెట్టు పూర్తిగా రహదారిపైకి ఒరిగి పోవడంతో ఏ క్షణంలో రోడ్డుపై పడుతుందోనని వాహనచోదకులు, ఉన్నతాధికారులు స్పందించి చెట్టును తొలగించి ప్రమాదాన్ని నివారించాలని వారు కోరుతున్నారు.